# కథాకేళి



మల్లాదివెంకటకృష్ణమూర్తి

★



## ఏంటీ-సెంటిమెంట్

ఏర్ కండిషన్డ్ గది

ఆ గదిలోని వాతావరణంకన్నా ఇంకా చల్లగా వున్న బీరు తాగుతున్నాడు సినిమా రచయిత ఆయనొక్కడేకాదు. ఆయనతోపాటు మరో ముగ్గురుకూడా

నిర్మాత, దర్శకుడు, సహకార దర్శకుడు ఆ ముగ్గురు.

"హీరోయిన్‌కి నెల తప్పింది. రైటే. పెళ్ళికాకుండా అలా జరిగినా ప్రేక్షకులు ఒప్పుకుంటారు కొడుకు పుట్టినా ఒప్పుకుంటారు. కాని హీరోయిన్ తండ్రి ఆమెకి అబార్షన్ చేయించి ఇంకొకడికిచ్చి పెళ్ళి చేయడమేమిటండి? ఇది పూర్తిగా యాంటీ సెంటిమెంట్ పనికిరాదు" చెప్పాడు సినిమా రచయిత

"నవల్లో అలాగే వుంది" చెప్పాడు సహకార దర్శకుడు.

"నవల వేరు, సినిమా వేరు నవలల్లో ఏం రాసినా చెల్లుతుంది సినిమా జీవితంలాంటిది. జీవితంలో ఏ అపస్మృతులు మనుషులకి నచ్చవో అవి తెరమీద భరింపలేరు అవన్నీ ఏంటి సెంటిమెంట్లు"

"కాని ఆ నవలలో..."

"నోనో! నేను అంగీకరించను ఓల్డ్ థింకింగ్ హీరోయిన్ కొడుకుని పెంచి పెద్దవాణ్ణిచేస్తుంది. కొడుకు నేవీలో చేరతాడు ఒరోజు తమ ఆఫీసర్‌ని ఇంటికి ఆహ్వానిస్తాడు ఆ ఆఫీసరే అతని తండ్రి హీరో, హీరోయిన్ ఒకర్నొకరు గుర్తుపడతారు. వాళ్ళ మెంటల్ కాన్‌ఫ్లిక్ట్, ఇమోషనల్ ప్లే సాంగు- ఆ ట్రెండ్‌లో ఆలోచించాలి..."

అరగంట చర్చ జరిగాక ఆ నవల సినిమాకి పనికిరాదని తేల్చేశారు. ఆ పాప్యులర్ నవలమీద జరిగిన చర్చవల్ల మరో కొత్త కథ తయారైంది. ఆ కథకి ఓ రూపం ఇచ్చే ప్రయత్నం చేయసాగారు నలుగురూ

పాప్యులర్ అయిన నవలల్లోని కథలని గుర్తుతెచ్చేలా వుండే అనేక తెలుగు సినిమాలెన్నో వచ్చాయి మరి!

ఓ అయిదు నెలలు వెనక్కి వెళితే, ఆరోజు...

* * *

సినిమా రచయిత కోపంతో తన కూతురు జుట్టుపట్టుకుని కసి తీరా కొట్టాడు

"సిగ్గులేదు పెళ్ళికాకుండానే.." చెప్తూ ఆగాడు.

వారంతర్వాత సూళ్ళూరుపేటలోని ఓ నర్సింగ్ హోమ్‌లో తన కూతురికి చడీచప్పుడు కాకుండా అబార్షన్ చేయించాడు కాలేజీ మాన్పించాడు.

అమ్మాయికి మంచి సంబంధాలు చూస్తున్నారు

ఇవాళో, రేపో పెళ్ళయిపోతుందా అమ్మాయికి పెళ్ళి కాకుండా కొడుకుని కని, ఆ బాబుని పెంచటం జీవితంలో ఏంటి సెంటిమెంట్ మరి!

✱